మాజీ ఎమ్మెల్యే మృతికి డిప్యూటీ మేయర్ సంతాపం



లాలాపేట: అనారోగ్యంతో మృతి చెందిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతి పట్ల డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. గురువారం హబ్సిగూడలోని వారి నివాసానికి వెళ్లి రాజిరెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురాలోని బస్తీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుకనర్మద మల్లిఖార్జున్ అన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా గురువారం నర్మద రసూల్‌పురా ఉషాగోదాం నుంచి ఎన్‌టీఆర్ విగ్రహం వరకు రూ.18 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే తాగునీటి పైపులైను పనులను ప్రారంభించారు. అనంతరం వివిధ బస్తీలు, కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు బాలంరాయి పంప్‌హౌజ్ నుంచి గన్‌బజార్ పంప్‌హౌజ్ పైపులైనుకు అనుసంధానం అయ్యేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మందుల శ్రవణ్, అశోక్ కుమార్, శ్రీశైలం, చిట్టిబాబు, అల్బెష్, రాజశేఖర్, ముకేష్, మహేష్, అనిల్, పరశురాం, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖలలో ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) అధ్యక్షులు పొన్నం ముత్యం గౌడ్ అన్నారు. గురువా రం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట బర్త్‌డే కేక్‌ను కట్ చే సి విద్యార్థులకు పంచిపెట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియామకాలలో జాప్యం చేసినందున నిరుద్యోగులు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. కొండ నాగేశ్వర్‌రావు, దూడపాక సురేష్, సంతోష్, భగత్ చంద్ర, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రెండేళ్ల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా కే.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎండీ మియాజాని, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా అశోక్, కోశాధికారిగా పాండులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రిటర్నింగ్ ఆఫీసర్ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డికి పరిచయం చేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై బీజేపీ సంబరాలు



బన్సీలాల్‌పేట్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడికి ప్రతికారంగా ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. బీజేపీ బన్సీలాల్‌పేట్ డివిజన్ నాయకులు గురువారం డివిజన్‌లో సంబరాలు నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. డివిజన్ రామంచ మహేష్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. రాజశేఖరరెడ్డి, కె. క్రిష్ణ, ఎస్. రాజు, వై. సురేష్, కేఎం క్రిష్ణ, ఎ. శ్రీనివాస్, హరినాథ్ నాయి పాల్గొన్నారు.

టాస్క్ పేరుతో టోకరా

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో సైబర్ క్రైం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోతీనగర్ ప్రభాత్‌నగర్‌కు చెందిన తాలారి సింధు హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంది. గత నెల 21న గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ మేసేజ్ వచ్చింది. తన పేరు మాలని అని టెలిగ్రామ్‌లో టాస్క్ ద్వారా పార్ట్‌టైమ్‌గా సంపాదిస్తుంటానని నమ్మించింది. తొలుత కొంత మొత్తాన్ని సింధూకు పంపించింది. ఈ క్రమంలోనే పలు దఫాలుగా సింధూ వద్ద నుంచి రూ. 44 వేల వరకు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. అదనంగా మరో కొంత నగదు వేయాలంటూ సింధైపై ఒత్తిడి చేయడంతో అనుమాన వచ్చిన సింధూ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లాలపై నిఘా



అమీర్‌పేట శ్రీనివాసనగర్‌లో మోటార్‌ను తొలగిస్తున్న జలమండలి విజిలెన్స్ సిబ్బంది..



- మోటారు వాడుతున్న వారిపై జలమండలి చర్యలు
- ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలో 45 మోటార్ల సీజ్
- ఫతేనగర్ సెక్షన్ పరిధిలో 10 మోటార్ల సీజ్..
- నిరంతరాయంగా డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టీకరణ..



మోటార్‌ను సీజ్ చేసి తీసుకెళ్తున్న సిబ్బంది..

సనత్‌నగర్: అక్రమంగా మోటార్లను బిగించి నీటిని తోడేస్తున్న వారి విషయంలో జల మండలి అధికారులు సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. నల్లాల్లో నీరు వచ్చే సమయంలో మోటార్లు వాడుతున్న వారి ఆట కట్టించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికారులు..తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. మంచినీరు.. అందరికీ సమాన సరఫరా అన్న నినాదంతో వాటర్‌వర్క్స్ అధికారులు నీటి సరఫరా చేస్తుండగా, ప్రెషర్ విషయంలో హెచ్చుతగ్గులు రావడంపై దష్టిసారించారు. దీనికి కారణం కొంతమంది మోటార్లను బిగించి నీటిని యథేచ్ఛగా లాగేస్తున్నట్లు జలమండలి అధికారులు గుర్తించారు. దీంతో మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ పేరిట గత నెల 15న స్పెషల్ డ్రై వ్ చేపట్టి దీనిని నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకుని ఆ మేరకు తనిఖీలను విస్తతం చేశారు.

అత్యధికంగా ఎస్ఆర్‌నగర్‌లోనే.. 45 మోటార్ల సీజ్..

లెక్కకు మిక్కిలిగా హాస్టళ్లకు నెలవైన ఎస్సార్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లోనే ఎక్కువగా మోటార్లతో నీటిని తోడేస్తున్నట్లు జలమండలి అధికారుల తనిఖీల్లో తేటతెల్లమైంది. హాస్టళ్ల వారు తమ స్వార్థం కోసం మోటార్లను బిగించుకుని అధిక ప్రెషర్‌తో నీటిని అలాగేసుకుంటుంటే సమీప నివాస ప్రాంత వాసులు గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితులు ఉండేవి. వాస్తవానికి రోజువిడిచి రోజు మంచినీటి సరఫరా చేస్తుంటారు. నిర్ణీత సమయం నీటిని వదులుతారు. కానీ మోటార్ల దెబ్బకు లో ప్రెషర్ కారణంగా జలమండలి పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే నీరు సరిపోక ట్యాంకర్లపై ఆధారపడి అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితులు ఇక్కడ సహజం. ఆ పరిస్థితి నుంచి వినియోగదారులకు విముక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో చేపట్టి మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటివరకు వాటర్‌వర్క్స్ ఎస్సార్‌నగర్ సెక్షన్ పరిధిలో 45 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. విచిత్రం ఏమిటంటే ఇక్కడి హాస్టళ్ల నిర్వాహకులు కొందరు వ్యవసాయ అవసరాలకు ఉపయోగించే అత్యధిక హెచ్‌పీ కలిగిన మోటార్లను సైతం వినియోగిస్తున్నారంటే నీటిని ఏ మేరలో తోడేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఫతేనగర్ సెక్షన్ పరిధిలో దాదాపు 10 మోటార్ల వరకు సీజ్ చేశారు.



అధికారులు సీజ్ చేసిన మోటార్లు..

మొదటిసారి రూ.5,000 జరిమానా..

జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న తనిఖీల్లో మోటార్లు పట్టుబడితే వాటిని సీజ్ చేయడమే కాకుండా మోటార్‌ను ఉపయోగిస్తున్న యజమానికి రూ.5000ల చొప్పున జరిమానా విధిస్తున్నారు. ఒకసారి పట్టుబడి మళ్లీ వినియోగిస్తే ఆ ఇంటికి మంచినీటి నల్లా కనెక్షన్‌ను కట్ చేయడం జరుగుతుందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. లైన్‌మెన్లు ఇచ్చే నివేదిక ఆధారంగా సెక్షన్ మేనేజర్ మోటార్లు బిగించిన వారి ఇంటికి వెళ్లి రూ.5 వేల జరిమానా విధించి మోటార్‌ను సీజ్ చేస్తున్నారు. అంతేకాకుండా మోటార్ వినియోగం జరిగిందంటూ క్యాన్‌సెంబర్‌ను బ్లాక్ లిస్టులో ఉంచుతారు. మేనేజర్ రోజువారీ నివేదికలను బట్టి జీఎం సైతం ర్యాండమ్‌గా పరిశీలన జరుపుతారు.

కూరగాయల ధరలు..



సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతు బజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 41, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నరపల్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని 100 ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ అర్హత కలిగి ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి వారి విద్యార్హత నైపుణ్యాన్ని అనుసరించి చక్కటి జీతభత్యాలతో పాటు ఇతర ఇన్సెంటివ్స్ ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: 'రాజీవ్ యువ వికాసం' పథకానికి సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ప్రభుత్వం ఇస్తున్న రాజీవ్ యువ వికాసం సబ్సిడీ పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన విధించడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఒకవైపు యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సబ్సిడీ పథకాలను అర్హులైన వారికి వర్తింపజేస్తామని గొప్పలు చెబుతూ.. మరోవైపు సబ్సిడీ పథకానికి అనేక కొర్రీలు, షరతులు విధిస్తుందని ఆరోపించారు. ఈ పథకానికి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది యువత దరఖాస్తు చేసుకున్నారని, ఇలాంటి తరుణంలో సిబిల్ స్కోర్ లాంటి నిబంధనను పెట్టడం యువత ఆశలపై నీళ్లు చల్లడమేనని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గౌరీ నాగరాజు, కొండల్, గౌస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనాథను ఆదరించి.. డిగ్రీ చదివించి..

ఘనంగా అనాథ యువతి హాల్దీ మెహిందీ ఫంక్షన్



పాయల్‌కు హాల్దీ మెహింది ఫంక్షన్ చేస్తున్న కార్పొరేటర్ నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: రెండేళ్ల వయసులో రైల్వే స్టేషన్‌లో దొరికి పోలీసుల సహకారంతో ఆశ్రమానికి వచ్చింది. నిర్వాహకులే కుటుంబ సభ్యులై అన్నీ చూసుకున్నారు. పాయల్‌కు రెండేళ్ల వయసున్నప్పుడు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉండగా పోలీసులు హిల్‌స్ట్రీట్ పాఠశాల ఆవరణలోని ఆశ్రయ్ రెయిన్‌బో హోంకు అప్పగించారు. రెండేళ్ల వయసు నుంచి అక్కడే ఉంటూ డిగ్రీ ఆమె ఇక్కడే పూర్తి చేసింది. ఆ తరువాత ఆప్తమాలజీ కోర్సు పూర్తి చేసి ఓ ఆప్టికల్ షాపులో ఉద్యోగం చేస్తుంది. చందానగర్‌కు చెందిన యువకుడిని ఇష్టపడింది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఆశ్రమం నిర్వాహకులు గ్రేస్.. కార్పొరేటర్ కొంతం దీపిక మరికొంత మంది దాతల దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లారు. బుధవారం రాత్రి ఆశ్రమం ఆవరణలో ఉత్సాహంగా మెహిందీ ఫంక్షన్ నిర్వహించారు.

వీధి కుక్కల వీరంగం.. ఇద్దరిపై దాడి

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్‌లోని నార్త్‌లాలాగూడ శేషాపహాడ్ ప్రాంతంలో గురువారం ఉదయం పారిశుద్ధ్య కార్మికురాలిపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. అదే విధంగా స్థానికంగా ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిపై కూడా దాడి చేసింది. వీధికుక్కలు విచ్చలవిడిగా దాడులు చేస్తున్నా సంబంధిత జీహెచ్ఎంసీ వెటర్నరీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బస్తీల్లో శునకాలు అధికంగా ఉన్నాయని అనేక మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వ్యభిచార గృహంపై దాడి.. నలుగురి అరెస్ట్

సనత్‌నగర్: వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న నలుగురిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బేగంపేట డీఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. బేగంపేటలోని ఓ అపార్ట్‌మెంట్స్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న అందిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. దాడి విషయం తెలుసుకున్న వ్యభిచారం గృహం నిర్వాహకులు బాలాజీ, అవినాష్, రాజు, శ్రావణి పరారయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువతులతో పాటు విటుడిగా వచ్చిన సురేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉన్న నిర్వాహకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

'సాక్షి ఎడిటర్ ఇంట్లో పోలీసుల తనిఖీ అమానుషం'

తీవ్రంగా ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

బన్సీలాల్‌పేట్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఏపీ పోలీసులు తనిఖీ చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవ పున్నయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజశేఖర్, నవీన్, నిరంజన్, రఘు, దామోదర్ తదితరులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంతో బాధ్యతగల పత్రికా ఎడిటర్ ఇంట్లో పోలీసులు తనిఖీలు చేయడం సరికాదన్నారు. నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలిస్తూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోలీసులు వ్యవహరించడం అమానుషమన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా జర్నలిస్టులను భయపెట్టాలనే ఉద్దేశంతో ఏపీ పోలీసులు ఇలా చట్టానికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని తాము ఇప్పటికే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులను భయపెట్టే విధానాలకు స్వస్తి చెప్పాలని కోరారు.

ఇది అప్రజాస్వామికం

ఉస్మానియా యూనివర్సిటీ: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి నివాసంపై పోలీసులు దాడి చేయాడాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ గురువారం ఖండించారు. ముందస్తుగా ఎలాంటి నోటీసులు లేకుండా దౌర్జన్యంగా పోలీసులు ఇంట్లోకి చొరబడి తనీఖీలు చేయడం అప్రజాస్వామికమన్నారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కల్గించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ.. సాక్షి ఎడిటర్ పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. లేని పక్షంలో హైదరాబాద్‌లోని కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు



లాలాపేట: మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను గురువారం లాలాపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆర్టీఏ మెంబర్ నేతికార్ సురేష్‌లాల్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ అని ఈ సందర్భంగా సురేష్ లాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రసిడెంట్ జగదీశ్వర్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ జాంగీర్, నేతికార్ సాయి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో రెండు బైక్‌లు, ఒక ఆటోట్రాలీ చోరీ

బంజారాహిల్స్: రిపేరు నిమిత్తం ఇచ్చిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ఎన్‌బీటీనగర్ మసీదు సమీపంలో నివసించే పిట్టల భరత్ ఈ నెల 2న మధ్యాహ్నం 3 గంటలకు తన బైక్ రిపేరు కోసం స్థానికంగా ఉండే మెకానిక్ షాపులో ఇచ్చాడు. మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు మెకానిక్ ఎండీ హనీఫ్ షాపునకు రాగా భరత్ ఇచ్చిన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా బైక్ ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఆటోట్రాలీ..

పార్కు చేసిన ఆటోట్రాలీ చోరీకి గురైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్‌పేట కో-ఈ-సార్ కాలనీకి చెందిన షేక్ ఫైజాన్ అలీ ఆటోట్రాలీ నడిపిస్తుంటాడు. ఈ నెల 4న తన ఆటోట్రాలీని స్థానికంగా ఉన్న జేకే మార్ట్ కిరాణా షాపు పక్కన పార్క్ చేసి తన స్వస్థలమైన మహారాష్ట్ర నాందేడ్‌కు వెళ్లాడు. ఈ నెల 7న తిరిగి రాగా తాను పార్క్ చేసిన ఆటోట్రాలీ కనిపించలేదు. దీంతో బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్క్ చేసిన యాక్టివా చోరీ..

పార్క్ చేసిన యాక్టివా చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వెంకటేష్ (35) తన హోండా యాక్టివాను గత నెల 30న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ వెనుక పార్క్ చేసి పనికి వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆశ్రయ్‌మాన్షన్ ప్లాట్ నెం.302లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యూ.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు డీఎస్ఐ జి.వెంకటేష్, ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి వెళ్లి కడప జిల్లాకు చెందిన సంగటి నాగేశ్వర్ రెడ్డి(56), నెల్లూరు జిల్లాకు చెందిన సి.ప్రభావతి(61) అనే ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించి రిమాండ్ నిమిత్తం గురువారం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. వారి నుంచి రూ.3 వేలు నగదుతో పాటు 6 కండోమ్ ప్యాకెట్లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఇద్దరు విటులు, ఇద్దరు బాధిత మహిళలను గుర్తించి విచారించినట్లు తెలిపారు. బాధితులైన ఇద్దరు మహిళలను కోర్టులో ప్రవేశపెట్టి కోర్టు ఆదేశాలసారం 'ప్రజ్వల హోం'కు తరలించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు సంగటి నాగేశ్వర్ రెడ్డిపై 2004లో చిక్కడపల్లి, 2008లో పంజగుట్ట, 2012లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో వ్యభిచార నేరంలో అరెస్టు అవ్వడంతో పాటు కోర్టు కేసులు కూడా రిజిస్టర్ అయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఉద్యోగం కోసం వచ్చి ఐఫోన్లు మాయం చేశాడు

సనత్‌నగర్: ఉద్యోగం కోసం వచ్చిన ఓ వ్యక్తి రూ.1.40 లక్షల విలువైన రెండు ఐఫోన్లను చోరీ చేసిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట డీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేటలోని ఎఫ్‌డీఆర్ ఆర్‌డీ టవర్స్‌లో గల జెప్టో కార్యాలయానికి స్టోర్ ప్యాకర్‌గా పనిచేసేందుకు బాలానగర్‌లోని జింకలవాడకు చెందిన గౌతమ్ అంకిత్‌పాత్ర (24) ఈ నెల 3వ తేదీన వచ్చాడు. ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత స్టోర్‌లో పనిచేసేందుకు అంగీకరించాడు. స్టోర్‌ను ఒకసారి చూసి వస్తానని చెప్పి స్టోర్‌లో కనిపించిన రెండు విలువైన ఐఫోన్లను తీసి దాచుకున్నాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి కార్యాలయానికి రాలేదు. ఆ తర్వాత స్టోర్ ఆడిట్ చేసిన నిర్వాహకులు రెండు ఐఫోన్లు కనిపించడం లేదని గుర్తించారు. సీసీ కెమెరాల ద్వారా గౌతమ్ అంకిత్‌పాత్ర సెల్‌ఫోన్లను చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు స్టోర్ ఉద్యగి తిలక్‌కుమార్ బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

సికింద్రాబాద్: భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన వివాహిత అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఒడిశా రాష్ట్రం పలపాతి గ్రామానికి చెందిన జడునాథ్ ముర్ము, మల్హో మణి ముర్ము(26) దంపతులు. ఈ నెల 6న సాయంత్రం 8 గంటల సమయంలో భార్యభర్తలు భువనేశ్వర్ రైల్వే స్టేషన్లో జనరల్ టికెట్ తీసుకొని విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలెక్కారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగి ప్లాట్ ఫాం నంబర్ 1లోని గేట్ నంబర్ 5 వద్ద కూర్చున్నారు. టూత్‌పేస్ట్ తీసుకొచ్చేందుకు భర్త జడునాథ్ బయటకు వెళ్లి వచ్చేసరికి భార్య కనిపించకుండా పోయింది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా భార్య మల్హో మణి ఆచూకీ లభించకపోవడంతో జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్య

చిక్కడపల్లి: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్రో స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌కు వచ్చిన గుర్తుతెలియని యువకుడు అక్కడే వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీనిని గుర్తించిన మెట్రో సిబ్బంది 108కు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతను పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీ

సనత్‌నగర్: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌కు చెందిన జంపని అవినాష్ (37) సర్వీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న సాయంత్రం 6 గంటలకు తన యమహా ఎస్‌జెడ్-ఆర్ఆర్-153 సీసీ బైక్‌ను తన ఇంటి ముందు పార్కు చేసి లోపలికి వెళ్లాడు. తిరిగి బయటకు వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో కేటీఎం డ్యూక్-250 బైక్ చోరీ..

భరత్‌నగర్ మహేశ్వరినగర్‌కు చెందిన కొల్లా రాకేష్ (26) తన కేటీఎం డ్యూక్-250బైక్‌ను గత నెల 15న రాత్రి 11.30 గంటలకు తన ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.